సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 29 । మే । 2023



టిప్పర్ ఢీ: ఇద్దరి దుర్మరణం
కడపలోని రిమ్స్ సమీపంలో స్నేహితుడి కోసం ఎదురు చూస్తున్న ఇద్దరిని మట్టి తీసుకెళుతున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. - 8లో



అంతర్ జిల్లా దొంగ అరెస్టు
ఏటీఎం కార్డును మార్చి బాధితుల వద్ద నుంచి నగదును అపహరిస్తున్న అంతర్ జిల్లా దొంగ కొర్రా శ్రీకాంత్‌ను కడప వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



16 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు
వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 16 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు 2015లో బదిలీ అయిన ఉపాధ్యాయుల సమావేశం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2015లో బదిలీ అయి తాజా బదిలీల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్న ఉపాధ్యాయుల సమావేశాన్ని 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కడప ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బాధిత ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర రెడ్డి, దేవదాస్, గౌస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తమకు జరిగిన నష్టాన్ని చర్చించి న్యాయపరంగా, ప్రత్యక్షంగా పోరాటం చేయడంపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బాధిత ఉపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

గ్రంథాలయ సంస్థలో బదిలీలు



ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులను అందజేస్తున్న చైర్‌పర్సన్ ఉషారాణి

కడప కల్చరల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న గ్రంథాలయ అధికారులు సిబ్బందికి ఆదివారం బదిలీలు నిర్వహించారు. సంస్థ చైరపర్సన్ ఎల్. ఉషారాణి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒకే చోట 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారికి వారి అభ్యర్థన, పరిపాలన సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకొని బదిలీలు చేపట్టామని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తెలిపారు. విధుల్లో చేరిన ఉద్యోగులు సమయపాలన, క్రమశిక్షణ పాటించి ప్రజల్లో గౌరవం పొందడంతో పాటు సంస్థ గౌరవం పెంచాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు క్రీడల్లో సాధన చేయాలి



మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ డానియల్ ప్రదీప్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని సీఎస్ఐ మైదానంలో ఆదివారం మినీ ఫుట్‌బాల్ టోర్నమెంట్-2023 నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను శాప్ బోర్డు డైరెక్టర్ ఎం. డానియల్ ప్రదీప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకుని ప్రతి రోజూ సాధన చేసి అందులో రాణించేందుకు కృషి చేయాలన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ మినీ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. జిల్లా మినీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. సురేష్‌బాబు, కార్యదర్శి కె. థామస్ మాట్లాడుతూ అండర్-14, అండర్-17, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్యాస్ట్ సర్టిఫికెట్



- జిల్లాలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు
- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందేలా కసరత్తు
- జిల్లాలో 423 గ్రామ, 222 వార్డు సచివాలయాలు
- 31,754 మంది విద్యార్థులకు ప్రయోజనం
- వీఆర్వోలు విద్యార్థుల ఇళ్లు, పాఠశాలలకు వెళ్లి నివేదిక

కుల ధ్రువీకరణ పత్రం
ఇక సులువు



కడపలోని వార్డు సచివాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జిల్లాలో ఉన్న 423 గ్రామ సచివాలయాలు, 222 వార్డు సచివాలయాల ద్వారా విద్యార్థులకు కుల ధ్రువీకరణపత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నత చదువులకు ప్రతి విద్యార్థికి కుల ధ్రువీకరణపత్రం ఎంతో అవసరం. కానీ ఈ సర్టిఫికెట్ పొందాలంటే ఎంతో ప్రయాస పడాలి. దీంతో విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేయకుండా ప్రతి విద్యార్థి చేతికి కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

వ్యయ ప్రయాసలకు చెక్

పదవ తరగతి, ఇంటర్‌తోపాటు ఆపై చదువులకు వెళ్లే విద్యార్థులకు కుల ధ్రువీకరణపత్రం అత్యవసరం. ఇప్పటివరకు విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాల కోసం నానా వ్యయ ప్రయాసలు పడేవారు. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి చెక్‌లిస్టుపై వారి సంతకాలు చేయించాల్సి వచ్చేది. చెక్ లిస్టుపై వీఆర్వో, ఆర్ఐ సంతకాలు చేస్తేనే తహసీల్దార్ సంతకం చేసి కంప్యూటర్ ఆపరేటర్‌కు పంపేవారు. ఆయన ఓకే చేస్తేనే మళ్లీ సంబంధిత సచివాలయానికి వెళ్లి కుల ధ్రువీకరణపత్రం తీసుకునేవారు. అయితే ఇప్పుడు ఈ వ్యవస్థలకు ప్రభుత్వం చెక్‌పెట్టింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో సచివాలయాల నుంచి విద్యార్థులకు నేరుగా ధ్రువీకరణపత్రాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో పదవ తరగతి ఉత్తీర్ణులైన 21,524 మంది, ఇంటర్ పాసైన 10,230 మంది కలిపి మొత్తం 31,754 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. విద్యాశాఖ వద్ద ఉన్న విద్యార్థుల డేటాను జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల డేటాబేస్‌కు అనుసంధానం చేస్తున్నారు. ఇలా సేకరించిన డేటాను రెవెన్యూశాఖ వారు గ్రామాల వారీగా విభజించి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వీఆర్వోల లాగిన్‌లకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీఆర్వోలు ఆ విద్యార్థులు చదువుతున్న పాఠశాలలు లేదా వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించి నివేదిక రూపొందిస్తున్నారు. అనంతరం విద్యార్థులకు కుల ధ్రువీకరణపత్రాలు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందించనున్నారు.

ఉచితంగానే సర్టిఫికెట్లు



టెన్త్, ఇంటర్ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగానే ఇస్తున్నాం. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఆదేశాల మేరకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారితో సంప్రదించి అడిగిన సమాచారం మేరకు విద్యార్థులకు సర్టిఫికెట్లను జారీ చేస్తున్నాం. ఈ ప్రక్రియ ప్రారంభమైంది.
– శివరామిరెడ్డి, తహసీల్దార్, కడప

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పదవ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి దరఖాస్తు చేయకుండానే కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తోంది. ఇది మంచి పరిణామం. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం నానా అవస్థలు పడేవారం. ఇప్పటికే సచివాలయాల ద్వారా ముఖ్యమంత్రి స్థానికంగానే సేవలు అందించడం సంతోషదాయకం. ఇప్పుడు ఉన్నత చదువుతోపాటు వివిధ అవసరాలకు ఉపయోగపడే సర్టిఫికెట్‌ను విద్యార్థులకు అందజేయడం హర్షణీయం.
– దొంగలసాని దేవరాజు, కడప

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు వేళాయె!

- నేటి నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్
- 29వ తేదీ నుంచి జూన్ 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- జూన్ 1 నుంచి 6 వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం



హెల్ప్‌లైన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పాస్ అయి పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం సోమవారం నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తరువాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఈ నెల 29వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో రావాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లాలో రెండు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాగా, మరొకటి ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను ఎంపిక చేశారు. ఇందులో అనుమానాల నివృత్తి కోసం 9618299017 నంబర్‌ను ఏర్పాటు చేశారు.

జూన్ 1వ తేదీ వరకు ప్రాసెసింగ్ చెల్లింపు

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుమును మే 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఇందులో ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 250 చెల్లించాల్సి ఉంటుంది. సంబంధిత ఫీజును జూన్ 1వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్లో చెల్లించాలని తెలిపారు.

కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సినవి

ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తరువాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఈనెల 29వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్‌తో రావాల్సి ఉంటుంది. విద్యార్థులు తమతోపాటు ప్రాసెసింగ్ రుసుము రసీదు, పాలిసెట్ ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కమ్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకుని రావాల్సి ఉంటుంది. వెరిఫికేషన్ పూర్తి అయిన తరువాత మొబైల్ నంబర్‌కు లాగిన్ ఐడీ వస్తుంది. రిజిస్టర్ మొబైల్ నంబర్‌తో జూన్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవచ్చు. పూర్తి వివరాలకు appoyc-e-t. nic.i n వెబ్‌సైట్ చూడాల్సిందిగా అధికారులు సూచించారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా...

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
29.05.23	1	12,000
30.05.23	12001	27,000
31.05.23	27001	43,000
01.06.23	43,001	59,000
02.06.23	59,001	75,000
03.06.23	75,001	92,000
04.06.23	92,001	1,08,000
05.06.22	1,08,001	చివరి ర్యాంకు

షెడ్యూల్ ప్రకారం..



విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుం చెల్లించాకే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌కు షెడ్యూల్ ప్రకారం రావాలి. ఎస్టీ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం కడప మహిళా పాలిటెక్నిక్‌కు రావాలి. స్పోర్ట్స్, ఎన్‌సీసీ, స్కౌట్, పీహెచ్, క్యాప్ విద్యార్థులు జూన్ 2 నుంచి విజయవాడ పాలిటెక్నిక్‌కు వెళ్లాలి.
– సీహెచ్ జ్యోతి, పాలిసెట్ కో–ఆర్డినేటర్, కడప

విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవులు



విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

జేఎన్‌టీయూఏ వైస్‌చాన్సలర్ జింకా రంగజనార్దన్ మాట్లాడుతూ చదువుతోనే ఏదైనా సాధించగలమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏది ఇష్టమో తెలుసుకుని వాటిలో విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాల్లో నిలుస్తారన్నారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం శ్రమించి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అఖిల భారత పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడారు. అభ్యుదయ సంఘం సావనీర్‌ను ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు సాధు అశోక్, చెన్నా వెంకట చంద్రబాబు, ఉపాధ్యక్షులు నందం లక్ష్మణ కుమార్, జింకా శ్రీనివాసులు, జలదుర్గం మునిస్వామి, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, బోగా ఆనంద్, అవ్వారు శ్రీనివాసులు, కోట సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక మార్పులపై బాలికలకు అవగాహన కల్పించాలి

కడప కార్పొరేషన్: యుక్తవయసులో బాలికలకు శరీరంలో వచ్చే మార్పుల గురించి తల్లిదండ్రులు వివరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. ఖాదర్‌వలీ అన్నారు. అంతర్జాతీయ నెలసరి శుభ్రత దినోత్సవం సందర్భంగా స్థానిక ఎర్రముక్కపల్లెలోని మెప్మా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌమార దశలో ఏర్పడే శారీరక మార్పులు బాల బాలికలకు పెద్దలుగా పరిణితి చెందడానికి తోడ్పడతాయన్నారు. బాలికలకు రుతుక్రమం సమయంలో చేయాల్సిన పనులు, చేయకూడని పనుల గురించి చెప్పాలన్నారు. ఎస్ఎస్ స్పెషలిస్ట్ గోపీనాథ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ వెంకట చక్రధర్ రెడ్డి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ బాబు, వైద్యాధికారి డాక్టర్ నందిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా. ఖాదర్‌వలీ

టీడీపీ మేనిఫెస్టో చెత్తబుట్ట

ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



కమలాపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: మహానాడులో టీడీపీ ప్రకటించిన మెనిఫెస్టో చెత్తబుట్టతో సమానం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో వేల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు మహానాడులో కొత్తగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. 2014 మేనిఫెస్టోపై ఎవరైనా ప్రశ్నిస్తారని 2015లోనే వెబ్‌సైట్ నుంచి తొలగించిన బాబుకు రాష్ట్రంపై, ప్రజలపై, ప్రభుత్వంపై చిత్త శుద్ధి లేదన్నారు. బాబు హయాంలో జీఎస్‌డీపీ రాష్ట్రానికి 22వ ర్యాంకు ఉండేదని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం నంబర్ వన్ ర్యాంకులో ఉందన్నారు. అలాగే ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో గత మూడేళ్లుగా నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కొత్తగా ప్రకటించిన మేనిఫెస్టోలో ఇంటికో విమానం, మహిళలకు 10 నుంచి 100 కిలోల బంగారం ఇస్తానని హామీలిచ్చి మోసం చేసే నాయకులకు కాలం చెల్లిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలవడం ఖాయం అన్నారు. ఈ నెల 31నాటికి జగనన్న సీఎంగా ప్రమాణం చేసి నాలుగేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బైక్‌ర్యాలీ, సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎన్‌ఆర్, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, గంగాధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కొండారెడ్డి, రామసుబ్బారెడ్డి, హిదాయత్, జావీద్, మస్తానయ్య, శరత్‌బాబు, పి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే.. రాజసమే..!

క్రీడల్లో రాణించాలని ఆసక్తి ఉన్న క్రీడాకారులను.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు చక్కటి వేదికగా నిలుస్తోన్న డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ప్రవేశాల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండించిన క్రీడాపాఠశాలలో ప్రవేశం కోసం ఎంపికల ప్రక్రియ మూడుదశల్లో నిర్వహించనున్నారు.

- క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు వేళాయె
- 4,5వ తరగతిలో ప్రవేశానికి ఎంపికలు
- జూన్‌లో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సెలక్షన్స్



డా.వైఎస్ఆర్ క్రీడాపాఠశాల

కడప స్పోర్ట్స్ : రాష్ట్రంలోని ఏకైక క్రీడాపాఠశాల డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల. 2006 డిసెంబర్ 30వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పాఠశాల రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలోని ఏకైక క్రీడాపాఠశాల కావడంతో రాష్ట్రస్థాయి క్రీడాపాఠశాలగా రూపుదిద్దుకుంది. ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను దేశానికి అందించిన ఈ పాఠశాలలో ప్రవేశం పొందాలంటే మూడుదశల్లో ఎంపికల ప్రక్రియను పూర్తిచేసుకుని రావాల్సి ఉంటుంది. ఇందులో ప్రవేశం పొందడం ద్వారా క్రీడాకారులు తమ ఉన్నతికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది.

4వ తరగతిలో ప్రవేశాలు..

డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి 20 సీట్లు బాలికలకు, 20 సీట్లు బాలురకు చొప్పున 40 సీట్లకు ఎంపికలు నిర్వహిస్తారు. తొలుత మండలస్థాయిలో ఎంపికలు నిర్వహించి అక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి పంపుతారు. జిల్లాస్థాయి ఎంపికలు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపుతారు. అక్కడ తుది ఎంపికలు నిర్వహించి 40 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. కాగా గతేడాది 4వ తరగతిలో మిగిలిన 11 సీట్లకు (7 బాలురు, 4 బాలికలు) ఈ యేడాది 5వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

ఏయే క్రీడాంశాల్లో శిక్షణ..

కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు 10 క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, తైక్వాండో, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో నిపుణులైన శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు.

ఎవరు అర్హులంటే..

కాగా ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు 2014 ఆగస్టు1 నుంచి 2015 జూలై 31వ తేదీ మధ్య పుట్టిన విద్యార్థులు అర్హులు. 5వ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు 2013 ఆగస్టు 1 నుంచి 2014 జూలై 31 మధ్యలో పుట్టిన వారు అర్హులు. మున్సిపాలిటీ/మీసేవ ద్వారా పొందిన పుట్టిన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాల్సి ఉంటుంది. అదే విధంగా ఆధార్‌కార్డు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్, ప్రధానోపాధ్యాయుడితో ధ్రువీకరించిన స్టడీ అండ్ కాండక్ట్ సర్టిఫికెట్, 6 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలి.

ఎంపిక విధానం: మూడు దశల్లో నిర్వహించే ఈ ఎంపికల్లో తొలుత మండలస్థాయిలో ఎంపికలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో జూన్ 15 నుంచి 20వ తేదీ వరకు ఆయా మండలాల్లో ఎంపికలు జరుగుతాయి. విద్యార్థి ఎత్తు, బరువులతో పాటు మోటార్ స్కిల్స్ (30 మీటర్ల ఫ్లయింగ్‌స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెం)లో ఎంపికలు నిర్వహిస్తారు. ఈ ఎంపికలను మండల కేంద్రాల్లో ఎంఈఓ మరియు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అనంతరం జిల్లాస్థాయిలో ఎంపికలు సెట్ప్ సీఈఓ/డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపడతారు. జిల్లాస్థాయి ఎంపికలు జూన్ 22 నుంచి 26వ తేదీ వరకు కడప డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ఎత్తు, బరువుతో పాటు మోటార్ స్కిల్స్ (30 మీటర్ల ఫ్లయింగ్‌స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగు, 6"10 షటిల్‌రన్, మెడిసినల్ బాల్‌పుట్)లో ఎంపికలు నిర్వహిస్తారు.

షెడ్యూల్

ఎంపికలు	తేదీలు	వేదిక
మండలస్థాయి	జూన్ 15 నుంచి 20	జిల్లాలోని మండల కేంద్రాల్లో
జిల్లాస్థాయి	జూన్ 22 నుంచి 26	జిల్లా కేంద్రమైన కడపలో
రాష్ట్రస్థాయి	జూన్ 29, 30	ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు



క్లుప్తంగా

జామతోట దగ్ధం



కాలి బూడిదైన జామతోట వద్ద మహిళారైతు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలపరిధిలోని గొరిగెనూరు గ్రామానికి చెందిన తలారి కాంతమ్మ అనే రైతుకు చెందిన జామ చెట్లు కాలి బూడిదయ్యాయి. కాంతమ్మ తనకు ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంలో జామచెట్లు వేసింది. ఆదివారం మంటలు వస్తుండటంతో స్థానిక రైతులు చూసి వెంటనే కాంతమ్మకు తెలియజేశారు. అమె అక్కడికి వెళ్లి చూసేసరికి తోట బూడిదగా మారింది. 600 జామచెట్లు, డ్రిప్పు పరికరాలు కాలిపోయాయి దాదాపు రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లిదని ఆమె తెలిపారు.ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.ఆకతాయిలు నిప్పు పెట్టారా లేక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి ఈ సంఘటన జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సుబ్బారావు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎవరి మీద అయిన అనుమానం ఉంటే ఫిర్యాదు చేయలేని రైతుకు సూచించారు. కేసు నమోదు చేసి విచారిస్తామని ఆయన సూచించారు.

పదోన్నతులను మాన్యువల్‌గా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతులను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కడపలోని కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే మే 17వ తేదీ విద్యాశాఖ మంత్రి సమక్షంలో అధికారులకు ఉపాధ్యాయ సంఘాలు జరిగిన చర్చలో బదిలీల అనంతరం ప్రమోషన్లను మాన్యువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఆన్‌లైన్ ద్వారా జరపాలని నిర్ణయించడం సరికాదని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, రాష్ట్ర రూట ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్‌లు మాట్లాడారు.

ఎస్ఈబీ సిబ్బందిపై దాడికి యత్నం

చాపాడు : మండలంలోని అనంతపురం గ్రామం వద్ద ఆదివారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేసేందుకు వెళ్లిన ప్రొద్దుటూరు ఎస్ఈబీ సీఐ మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ గురయ్యపై అనంతపురం గ్రామానికి చెందిన గండు రాజు, గండు వెంకటరమణ కట్టెలతో దాడికి ప్రయత్నించినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున మోహన్‌రెడ్డి, గురయ్యలు బొలెరో వాహనంలో వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా అనంతపురం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను గుర్తించారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను ఆపి పట్టుకునేందుకు ప్రయత్నించిన సీఐ, కానిస్టేబుల్‌పై రాజు, వెంకటరమణ దాడికి ప్రయత్నించారు. ఈ ఘటనపై సీఐ మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిప్పర్ ఢీ: ఇద్దరి దుర్మరణం



యాకోబు మృతదేహం



ముబారక్ మృతదేహం

కడప అర్బన్ : కడపలోని రిమ్స్ ఆసుపత్రి సమీపంలో బొరుగుల ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో స్నేహితుడి రాకకోసం ఎదురు చూస్తున్న ఇద్దరిని మట్టి తీసుకెళుతున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరూ డ్రైవర్లుగా విధులను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో చెన్నూరు మండలం చిన్నమాచుపల్లెకు చెందిన యాకోబు(35), కడప నగరం కాగితాల పెంటకు చెందిన ముబారక్ (24)లు ఉన్నారు. యాకోబు చెల్లెలు కడప రిమ్స్‌లో వైద్య సేవలను పొందుతుండగా చూసేందుకు ఇద్దరు ద్విచక్ర వాహనంలో కడప నుంచి బయలుదేరారు. బొరుగుల ఫ్యాక్టరీకి వెళ్లేదారిలో తమ స్నేహితుడు వీరయ్య కోసం ఎదురు చూస్తూ రోడ్డు పక్కన తమ ద్విచక్రవాహనాన్ని నిలబెట్టుకుని ఉన్నారు. అదే సమయంలో మట్టిలోడుతో ఉన్న టిప్పర్ రిమ్స్ వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొనడంతో వీరిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ముబారక్‌కు ఇంకా వివాహం కాలేదు. యాకోబుకు భార్య అపర్ణ, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలంలో యాకోబు భార్య, ముబారక్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని కడప రిమ్స్ పీఎస్ ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలను కడప రిమ్స్ మార్చురీకి తరలించారు.

బైక్‌లు అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనలు ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగాయి. కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన మల్లీశ్వరయ్య అలియాస్ వేణు (46) మదనపల్లెలోని అభ్యుదయ స్కూల్ బస్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం మదనపల్లెకు వెళ్లి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా రాచవేటివారిపల్లె పంచాయతీ ఆచార్లపల్లె వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అధిక రక్తస్రావమైంది. స్థానికులు 108కు సమాచారం అందించారు. బాధితున్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాధితునికి భార్య బుజ్జమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. అదే విధంగా బండ్లపై గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ (15) ఆదివారం ద్విచక్రవాహనంలో పొలం వద్దకు వెళుతుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో బాధితుడి కాలు విరిగింది. కుటుంబ సభ్యులు అతన్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఇంటాక్' సేవలను విస్తరిద్దాం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఇలియాస్‌రెడ్డి

కడప కల్చరల్ : ఇంటాక్ సంస్థ సేవలను విస్తరించేందుకు ప్రజలు కలిసి రావాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. ఇందుకు తన వంతు సహకారం తప్పక ఉంటుందన్నారు. భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ నూతన కన్వీనర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారసత్వ రక్షణ బాధ్యతను విద్యార్థుల పాఠ్యపుస్తకాలలోని ప్రతిజ్ఞ ద్వారా ఆనాడే మన విద్యావేత్తలు గుర్తు చేశారన్నారు.జిల్లా వాసుల జీవన విధానం, దాన గుణం, ఆహారం సంస్కృతి సంప్రదాయాలు, విలక్షణమైనవని చెప్పారు. ప్రజలకు వారసత్వ సంపదపై అవగాహన కల్పిస్తే వాటిని కాపాడుకోవచ్చన్నారు.

అనంతరం ఆయన ఆధ్వర్యంలో ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్‌రెడ్డి, నూతన కన్వీనర్‌గా మానస కె. చిన్నపరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే కో కన్వీనర్, 70 మంది నూతన సభ్యులు కూడా ప్రమాణం చేశారు. నూతన కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంపదను రక్షించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సభ్యులను నాలుగు సబ్ కమిటీలుగా విభజించి జిల్లా నాలుగు వైపులా గల వారసత్వ విశేషాలను డాక్యుమెంటేషన్ చేయిస్తామన్నారు.వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు, బద్వేలు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట. రాయచోటిలలో కూడా ఇంటాక్‌ను విస్తరింపజేస్తామన్నారు. పాత కలెక్టరేట్ పూర్తిగా శిథిలం కాకముందే మరమ్మతులు చేయించాలని, మ్యూజియాన్ని అందులోకి మార్చాలని కోరారు. సంస్థ పూర్వ కన్వీనర్ ఇలియాస్‌రెడ్డి ఇంటాక్‌లో తన 15 ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు. గౌరవ సలహాదారుడు, పూర్వ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గండికోట ఉత్సవాలను తిరిగి నిర్వహించాలని, చింతకుంట చిత్రాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో సంస్థ విస్తరణకు సభ్యునిగా సహకరిస్తామన్నారు. ఇంటాక్ నూతన , పూర్వ కన్వీనర్లు పీవీ సుబ్బారెడ్డి, పాలెం వేణుగోపాల్ కూడా మాట్లాడారు. అనంతరం పురావస్తు, దేవదాయ తదితర సంస్థల ప్రతినిధులు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

చెన్నూరు : చెన్నూరు ఎల్లమ్మకాలనీ ఇటుకల బట్టి వద్ద ఐపీఎల్‌కు సంబంధించి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారన్నా సమాచారంతో ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.60వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య



నరసింహారెడ్డి మృతదేహం

సింహాద్రిపురం : సింహాద్రిపురానికి చెందిన నరసింహారెడ్డి(40) అనే రైతు కడుపు నొప్పి తాళ లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రోషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహారెడ్డి రెండు సంవత్సరాల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు వివిధ ఆసుపత్రుల్లో చూపించారు. నొప్పి వచ్చినప్పుడల్లా మాత్ర వేసుకుంటూ ఉండేవాడు. శనివారం సాయంత్రం విపరీతమైన నొప్పి రావడంతో జీవితంపై విరక్తి చెంది తన తోటలో విషద్రావణం తాగాడు.గట్టిగా అరుస్తుండటంతో అతని భార్య చూసి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి చికిత్స కోసం పులివెందుల ఆసుపత్రికి తీసుకెళ్లారు.పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. నరసింహారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్లు ఖాళీ చేయమన్నందుకు..

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలోని దానవులపాడు గ్రామానికి చెందిన ఆవుల సైమన్ (55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం మేరకు వివరాలు.. సైమన్ కొన్నినెలల కిందట గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన ఇంటిని విక్రయించాడు. అదే ఇంటిలో ఉంటున్నాడు. మీకు ఇచ్చిన గడువు అయిపోయిందని, ఖాళీచేయాలని ఇళ్లు ఖాళీ చేయాలని కొనుగోలు చేసిన వ్యక్తి సూచించాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు.బంధువులకు విషయం తెలియడంతో వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఏడాది కిందట సైమన్ భార్య లక్ష్మీదేవి, కుమార్తె మృతి చెందారు. ఈ విషయమై ఎస్‌ఐ సుబ్బారావును వివరణ కోరగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తామని తెలిపారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలు



విజేతలతో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సుండుపల్లె(రాజంపేట) : అన్నమయ్య జిల్లా సుండుపల్లె క్రీడామైదానంలో మూడురోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు ముగిశాయి.ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ బాలుర విభాగంలో విజయనగరం, అనంతపురం జిల్లాల జట్టులు తలపడ్డాయి. విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. బాలిక విభాగంలో కడప, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. కడప జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో రాష్ట్ర పీఈటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ఎంపీపీ రాజమ్మ, జడ్పీటీసీ ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి శివారెడ్డి, రహిమాన్, ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, సీఐ లింగప్ప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు జ్ఞాపికలు అందచేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో విజేతగా నిలిచిన జట్లకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జ్ఞాపికలను అందచేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషిచేస్తున్నారన్నారు. విద్యతోపాటు క్రీడలను కూడా పెంపొందించాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం



రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

పెద్దముడియం : మండల పరిధిలోని నాగరాజుపల్లెలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు రైతులు ఆత్మహత్యకు యత్నించారు.వివరాలు.. గ్రామానికి చెందిన ఉమ్మడి నారాయణరెడ్డి 20 ఎకరాల్లో ,రాచమల్లు చిన్నపరెడ్డి కౌలు భూమి 10 ఎకరాల్లో 25 రోజుల క్రితం మినుము పంట సాగు చేశారు.నెల రోజుల కిందట కురిసిన గాలివానకు పొలాల్లోని కరెంటు స్తంభాలు పడిపోయాయి.దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.రైతులు సాగు చేసిన పొలాలకు కుందూ నది నుంచి నీటి సరఫరాకు విద్యుత్ అవసరం కావడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులను కోరుతున్నారు. సమస్యను పలుమార్లు వివరించినా స్పందన లేకపోవడం, దానికి తోడు సాగు చేసిన పంటలకు నీటి తడులు అందకపోవడంతో ఎండిపోతున్నాఇయ. దీంతో ఆందోళన చెందిన రైతులు పొలం వద్ద విషద్రావణం తాగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శించారు.అక్కడ నుంచే విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెల్ టవర్ ఎక్కి..



సెల్ టవర్ ఎక్కిన సంతోష్

పులివెందుల రూరల్ : తన భార్య కాపురానికి రాలేదని నిరసన వ్యక్తం చేస్తూ సెల్‌టవర్ ఎక్కి ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. "జమ్మలమడుగుకు చెందిన సంతోష్ పులివెందుల నగరి గుట్టకు చెందిన మేరీని 13 ఏళ్ల కిందట వివాహం చేసుకున్నాడు.వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంతోష్ కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవపడేవాడు.దీంతో మేరీ తొమ్మిదేళ్ల క్రితం పులివెందులలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. కొద్దికాలం తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసి ఇద్దరు కలిసి ఉండే విధంగా పులివెందులలో సంసారం పెట్టించారు. అయితే సంతోష్ వ్యవహారం మారలేదు. దీంతో మేరి మళ్లీ పుట్టింటికి వెళ్లింది. సంతోష్‌ను ఇంట్లోకి రానివ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని ఆదివారం సెల్ టవర్ ఎక్కి బెదిరించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హుస్సేన్ సెల్ టవర్ వద్దకు చేరుకుని సంతోష్‌కు నచ్చ చెప్పి కిందకు దింపారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన చౌటపల్లె ఎద్దులు

రాజుపాళెం : వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని అర్కటవేముల గ్రామంలో గంగ జాతర సందర్భంగా ఆదివా రాష్ట్రస్థాయి సీనియర్స్ వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లె ఎద్దులు 3409 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. ఎద్ల యజమానికి రూ.1,00,016 నగదును అందించారు. ఇందులో మొత్తం ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. 3250 అడుగులు లాగి రెండో స్థానంలో తెలంగాణ రాష్ట్రంలోని హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎద్దు , మూడోస్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె రామాంజనేయులు ఎద్దు, నాలుగో స్థానంలో అనంతపురం జిల్లా ఉరవకొండ మహమ్మద్ ఆలీ ఎద్దు (2372 అడుగులు), 2355 అడుగులు లాగి ఐదోస్థానంలో నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని మూడురాళ్లపల్లె పులి చిన్న ఓబుల్‌రెడ్డి ఎద్దు నిలిచాయి. గెలుపొందిన యజమానులకు రెండో, మూడో, నాలుగో, ఐదో బహుమతులుగా రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదును అందించారు. అయితే గార్లదిన్నె రామాంజనేయులు ఎద్దు బండ లాగుతుండగా బండ విరిగిపోయింది. చివరగా మిగిలిన బాపట్ల జిల్లా వేటపాలెం శివకృష్ణ చౌదరి ఎద్ల జత బండలాగకుండానే రూ.30 వేలు ఇచ్చి కమిటీ సభ్యులు పోటీలను ముగించారు. ఎలాంటి గొడవలు జరగకుండా ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పగిడాల భజన సంఘం సభ్యులు మజ్జిగను పంపిణీ చేశారు.

16 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు



నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు రెండు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 16 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబుల పర్యవేక్షణలో రెండు టీమ్‌లు శనివారం రాత్రి నుంచి కూంబింగ్ నిర్వహించారు. ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ నరేష్ బృందం కడప సబ్ కంట్రోల్ నుంచి సీఎల్ బావి బేస్‌క్యాంపు చేరుకుని అగ్నిగుండాల మీదుగా తిప్పిరెడ్డిపల్లి, అక్కడి నుంచి జోరగోడ్లు ప్రాంతానికి ఉదయం 6గంటలకు చేరుకున్నారు. ఆ సమయంలో ఎర్రచందనం దుంగలను కొందరు మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టి 14 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 17 ఎర్రచందనం దుంగలను, లగేజీ ఆటోను, రెండు మోటార్‌సైకిళ్లు, 13 పిడిలేని ఇనుపగొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో అనంతపురం జిల్లా కదిరికి చెందిన మేకల నాగమల్లప్ప నాయుడు, వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేటకు చెందిన ఇడగొట్టు నగేష్, మైదుకూరుకు చెందిన ఇడగొట్టు నాగేశ్వరరావు, ఇడగొట్టు శ్రీనివాసులు, బ్రహ్మంగారి మఠానికి చెందిన దేవళ్ల సుబ్బరాయుడు, చాపాడుకు చెందిన తమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య, శ్రీపతి ప్రీదిపాల్, రామరాజశేఖర్, శ్రీరామ జాస్వా, ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన మామిళ్ల నాగేంద్ర, ఇల్లూరు వినోద్, కడప నగరానికి చెందిన మల్లెల బోయిన వెంకటేశు, అనంతపురం జిల్లా ఎన్.పి కుంటకు దండి సూరి, సత్యసాయి జిల్లా గాలంపేటకు చెందిన మొలకల శేషాద్రి ఉన్నారు. ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన టీమ్ లింగాధర్ సానిపాయి బేస్ క్యాంపు నుంచి పొంతరేవల మీదుగా కూంబింగ్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజిలోని తుమ్మలబైలు చేరుకుని చిప్పగొందిదొన వద్దకు రాగా, అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొందరు పారిపోయారు. వీరిలో ఇద్దరిని పట్టుకోగలిగారు. వీరి వద్ద నుంచి 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన శివరాజ్, శివమణిగా గుర్తించారు. మొత్తం రెండు సంఘటనల్లో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కోగా, వీటి విలువ సుమారు రూ. 40 లక్షలు ఉంటుందనీ డీఎస్పీలు తెలిపారు. ఈ కేసులను సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ మోహన్‌నాయక్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

శ్రీ శ్రీనివాస I.T.I ప్రొద్దుటూరు
■ 2023-24 సం॥కు ఎలక్ట్రీషియన్ (80 సీట్లు), డ్రాఫ్ట్‌మేన్ సివిల్ (48 సీట్లు), ట్రేడుల యందు అడ్మిషన్లు జరుగుచున్నవి. చేరుటకు సంప్ర: 9490633112. శిక్షణ-ఉత్తీర్ణత-ఉపాధి మా లక్ష్యం. [C-785996]

NEET COACHING
■ LAKSHMI IIT NEET ACADEMY. Neet Logterm Rajiv Park Road, Near Reddy Seva Samithi, Kadapa. Cell:9966296467. [C-785994]

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1421]

SERVICE

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6140]

పాస్‌పోర్ట్ పోయినది
■ I, UDAVAGANDLA KARIMUN W/o. U. MAGBUL BASHA, R/o 5-213-A, పోలీస్ స్టేషన్ దగ్గర, యర్రగుంట్ల టౌన్, కడప జిల్లా. A.P. పాస్‌పోర్ట్ నెం: H8825335 గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. దొరికిన వారు తెలుపగలరు. సెల్: 8317660952. [C-785997]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2401]

WANTED
■ అనుభవం కలిగిన టైలర్లు మరియు మగ్గం వర్క్ చేయు వారికి ఉద్యోగ అవకాశము కలదు. సంప్రదించవలసిన నెంబరు : 9989775574. [C-785759]

■ మహాలక్ష్మి ట్రెల్స్ షోరూం నందు పని చేయుటకు అనుభవం గల సేల్స్ బాయ్స్ కావలెను.ఆకర్షణీయమైన జీతం Q: ఇంటర్/డిగ్రీ. ఆకర్షణీయమైన జీతం.సంప్ర: మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు. సెల్: 9550545150. [C-785995]

■ ప్రముఖ ఎడ్యుకేషన్ సర్వీస్ నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F) కావలెను. అర్హత: 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech, సంప్ర: 9030004604. [C-785762]

■ కడప ఆర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రీ ప్రైమరి నుండి 4వ తరగతి వరకు మరియూ మాంటిస్సోరి పద్ధతిలో బోధించబడును. అడ్మిషన్లు జూన్ 4వరకు పొడిగించబడినవి. ఫీజు వివరాలకు 9573622276. [C-784826]

■ టీచర్స్ కావలెను! కడప నగరంలోని, ప్రముఖ నజ్ముల్ అమీన్ E.M స్కూల్ నందు నర్సరి నుండి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులు బోధించుటకు అనుభవం గల టీచర్స్ కావలెను.6301553011, 9885199652. [C-1205194]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995374999 [HA.208]

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం కలదు. Q: 10, ఇంటర్, డిగ్రీ (P/F). Age: 18 to 30. నో ఫీజ్. సెల్: 9177342337. [WA-6970]

■ ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి మాత్రమే ఫ్రాంచైజ్ ఇవ్వబడును. Mega Group Man Power & Security. Cont : 7032610569, 7093125169. [NA-5635]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786362]

■ ప్రముఖ IIBM సంస్థ నందు (15000/- to 20,000/-) పనిచేయుటకు వయస్సు : 18 to 28 లోపు, యువతీ, యువకులు కావలెను. (Unmarried) అర్హత : 10th to PG, ఉచిత వసతి. ఫోన్: 63051 36884, 93905 28568 [V- 2834]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705944423
9705907418
9010223797
9010072409

కార్మిక వర్గాన్ని విస్మరిస్తున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మివ వర్గాన్ని విస్మరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం ఏఐటియూసీ రాష్ట్ర సమ్మేళనాల్లో భాగంగా రెండోరోజు ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో కార్మిక లోకానికి అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణ తరహాలో రూ. 13 వేలు వేతనం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రధాని మోదీ ప్రైవేట్ పరం చేసి అదానీ, అంబాలనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక వర్గాన్ని పోరాటాలకు సిద్ధం చేసేందుకు యువ కార్మిక సమ్మేళనాలు, విద్యా, వైద్యానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లసాని రామారావు, నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, కెసీ బాదుల్లా, మద్దిలేటి పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు



సర్టిఫికేట్‌లతో చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శాస్త్రినగర్‌లో ఆదివారం జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-8, 10, 12, 14 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపరచిన వారు జూన్ 3, 4 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలలో పాల్గొంటారని స్పీడ్ స్కేటింగ్ జిల్లా సెక్రటరీ పవన్ కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డిలు గెలుపొందిన వారికి పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు. పోటీలను ఆర్గనైజింగ్ సెక్రటరీ చరణ్‌కుమార్‌రెడ్డి, బాషా, నాగేంద్ర, చంద్ర, అహమర్‌బాషా, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కడప డిఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాతో పాటు, అనంతపురం , చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఏటీఎం కార్డును మార్చి బాధితుల వద్ద నుంచి నగదును అపహరిస్తున్న అంతర్‌జిల్లా దొంగ కొర్రా శ్రీకాంత్‌ను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వెల్లడించారు. ఆదివారం రాత్రి కడప డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.శ్రీకాంత్ అనంతపురం జిల్లా తనకల్లు మండలం ఏనుగుండ్ల తండా గ్రామానికి చెందిన వ్యక్తి అన్నారు. నిందితుడి వద్ద నుంచి 27.5 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ. లక్ష నగదును, మోటార్‌సైకిల్‌ను, 24 ఏటిఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రెండున్నర లక్షల మేరకు ఉంటుందన్నారు. నిందితుడిపై ఇప్పటికే గుత్తి, మదనపల్లి, అలిపిరి, అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నాయన్నారు.ఏటీఎం సెంటర్ల వద్ద అమాయకులైన ప్రజలను, ప్రధానంగా వృద్ధులను టార్గెట్ చేస్తాడన్నారు. బాధితుల వద్ద నుంచి ఏటీఎం కార్డులను ఏమార్చి వారికి తన వద్ద ఉన్న ఏటీఎం కార్డును ఇస్తాడన్నారు. బాధితుల కార్డులను ఉపయోగించి వారి ఖాతాల్లోని నగదును ఎంచక్కా కాజేస్తాడన్నారు. ఇటీవలి కాలంలో కడప వన్‌టౌన్‌లో రెండు కేసులు, ప్రొద్దుటూరు టూటౌన్, నెల్లూరు వన్‌టౌన్, శ్రీకాళహస్తి వన్‌టౌన్, చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లలో ఒక్కొక్క కేసు ఉందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐలు మల్లయ్య, శ్రీను, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ పాకా వరప్రసాద్, కానిస్టేబుళ్లు కిరణ్, నారాయణ రెడ్డి,బాష, ఖాదర్‌లకు డీఎస్పీ నగదు రివార్డులను అందజేసి అభినందించారు.